

పేరుపాలెంబీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలలో బీచ్‌కి తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాలలో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటలలో సహపంతి భోజనాలు చేసి సేద తీరారు.




సముద్ర కెరటాలలో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

మత్స్యశాఖ రూటే వేరు..!

- ఆ శాఖ కమిషనర్ ఆదేశాలు బేఖాతార్
- నిడమర్రు మండల ఎఫ్‌డిఒపై పది రోజుల్లో విచారణ పూర్తికి ఆదేశాలు
- దాదాపు నెలరోజులైనా పూర్తికాని పరిస్థితి
- విచారణ అధికారి వ్యాఖ్యలతో రైతుల్లో ఆందోళన
- పిజిఆర్ఎస్ ఫిర్యాదులపై సరైన స్పందన కరువు
- పదేపదే రీఓపెన్ చేసి, రాష్ట్రస్థాయి అధికారులు జోక్యం చేసుకుంటేనే కదలిక
- ప్రభుత్వ పంట బోదెను కలిపేసుకున్న చేపల చెరువుకు స్పష్టమైన నోటీసులు ఇవ్వని పరిస్థితి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా మత్స్యశాఖ అధికారులు తమ రూటే సపరేటు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజలిస్తున్న ఫిర్యాదులపై మత్స్యశాఖ అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఆ శాఖ రాష్ట్రస్థాయి అధికారుల వరకూ వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పిజిఆర్ఎస్ ఫిర్యాదులను పరిష్కరించకుండానే ఏదో కారణం చూపి ముగించేయడంతో బాధితులు పదేపదే రీఓపెన్ చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నిడమర్రు మండలం తిమ్మారావుగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 164-2, 3 మరికొన్ని సర్వే నెంబర్లలో సన్న, చిన్నకారు రైతులు తవ్వుకున్న చేపల చెరువు వ్యవహారంలో ఏర్పడిన సమస్యపై మత్స్యశాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. మండలంలో పనిచేసే ఆ శాఖ ఎఫ్‌డిఒ పక్కనే ఉన్న దాదాపు 150 ఎకరాల చేపల చెరువులకు సంబంధించిన బడాబాబులకు కొమ్ముకాస్తూ సామాన్య రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడంపై బాధిత రైతులు అధికారులు చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఎఫ్‌డిఒ ఇష్టానుసారంగా నోటీసులు జారీ చేసినట్లు రైతులు చెబుతున్నారు. దీనిపై బాధిత రైతులు అనేకసార్లు డివిజన్, జిల్లా మత్స్యశాఖ



Office of the Commissioner of Fisheries
Poranki (Post), Bandar Road, Vijayawada- 521137

mo No.4377/P2/2017 Date: 23.04.2025

Fisheries – PGRS - Representation from Sri. G. V. Krishnarao R/o. Ganapavaram Village & Mandal, West Godavari District –take necessary action- Regarding
1) Representation Sri. G. V. Krishnarao R/o. Ganapavaram Village & Mandal, West Godavari District received on 05.03.2025
2) This Office Memo No.4377/P2/2017 Dated 17.04.2025
3) Representation Sri. G. V. Krishnarao R/o. Ganapavaram Village & Mandal, West Godavari District received on 15.04.2025

***

The attention of the District Fisheries Officers of Eluru Districts is invited to the erence 2nd cited, wherein, this office has requested the District Fisheries Officer of West davari to conduct enqiry and take necessary action in the matter as per rules in vogue

Vide 3rd cited Sri. G. V. Krishnarao R/o. Ganapavaram Village & Mandal, West davari District has once again requested to conduct enquiry regarding allegations on FDO, damarru of Eluru District (Copy enclosed)

In view of above, the DFO of Eluru district is requested to find enclosed copy of the resentation, conduct enqiry and take necessary action in the matter as per rules in vogue and nish action taken report to applicant under copy to Head Office with 10 days from receipt of s memo.

పదిరోజుల్లో విచారణ పూర్తిచేయాలంటూ దాదాపు నెల రోజుల క్రితం మత్స్యశాఖ కమిషనర్ ఇచ్చిన ఆదేశాల కాపీ

అధికారులకు పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో బాధితులు వేరే గత్యంతరం లేక మత్స్యశాఖ కమిషనర్‌కు పిజిఆర్ఎస్‌లో ఆధారాలతో సహా ఫిర్యాదు చేయడం జరిగింది. దీనిపై స్పందించిన కమిషనర్ కార్యాలయంలో నిడమర్రు మండలం ఎఫ్‌డిఒపై వెంటనే విచారణ జరిపి పది రోజుల్లో నివేదిక సమర్పించాలని ఏప్రిల్ 17వ తేదీన జిల్లా మత్స్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఏప్రిల్ 23న కమిషనర్ కార్యాలయం ఇదే విషయంపై మరోసారి ఆదేశాలు జారీ చేయడం జరిగింది. దీనిపై జిల్లా మత్స్యశాఖ అధికారులు కైకలూరు ఎడి రాజకుమార్‌ను విచారణ అధికారిగా నియమించారు. దాదాపు నెల రోజులు గడిచినా ఇప్పటివరకూ ఆయన విచారణ పూర్తిచేసి నివేదిక ఇవ్వలేదు. మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాలపై ఈ విధమైన నిర్లక్ష్యం వహించడం జిల్లాలోని మత్స్యశాఖ అధికారుల తీరును ప్రస్ఫుటం చేస్తోంది. ఆ శాఖ రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాలను సైతం పాటించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

విచారణ అధికారి తీరుతో రైతుల్లో ఆందోళన

నిడమర్రు మండలంలోని మత్స్యశాఖ ఎఫ్‌డిఒ నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన నోటీసులపై బాధితులు ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎఫ్‌డిఒ నీటి హక్కులపై జారీ చేసిన నోటీసుపై రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఎఫ్‌డిఒ అధికార దుర్వినియోగంపై బాధిత రైతులు మత్స్యశాఖ అధికారులకు పదేపదే ఫిర్యాదు చేశారు. విచారణ అధికారి ఎఫ్‌డిఒ జారీ చేసిన నోటీసులపై కాకుండా ఇతర కోణంలో విచారణ జరుపుతున్నారంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. మీ చెరువు పక్క చెరువుదారునికి ఇవ్వొచ్చు కదా వంటి ప్రశ్నలు వేయడంపై రైతులకు పలు అనుమానాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఎఫ్‌డిఒ జారీచేసిన నోటీసుల కారణంగా తొమ్మిది నెలలుగా చెరువు సాగుకు నోచుకోని పరిస్థితి ఉందని, విచారణ అధికారి ఆ విషయంపై కాకుండా వేరే కోణంలో విచారణ చేస్తున్నారన్న అనుమానాలు రైతుల్లో నెలకొన్నాయి. విచారణ పారదర్శకంగా జరగాలని రైతులు కోరుకుంటున్నారు.

ప్రభుత్వ భూమి ఉన్నా నోటీసులు ఇవ్వని పరిస్థితి

సర్వే నెంబర్ 148-163లో తవ్విన 70 ఎకరాల చేపల చెరువులో ప్రభుత్వ పంట బోదె ఉన్నట్లు ఇచ్చిన ఫిర్యాదుకు సంబంధించి ఇప్పటివరకూ మత్స్యశాఖ అధికారుల అవతలి వైపువారికి స్పష్టమైన నోటీసులు జారీ చేయలేదని రైతులు చెబుతున్నారు. మండల తహశీల్దార్ ధృవీకరించలేదంటూ మత్స్యశాఖ అధికారులు చెబుతూ వస్తుండటం మరింత విడ్డూరంగా ఉంది. ఇప్పటికే తహశీల్దార్ పంట బోదెను నిర్ధారణ చేసి అక్కడ బోర్డు సైతం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమి ఉందని రెవెన్యూ అధికారులు నిర్ధారణ చేసినప్పటికీ మత్స్యశాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మత్స్యశాఖ మండలాధికారి పట్టించుకోకపోతే డివిజన్, జిల్లా అధికారులు సైతం చర్యలు తీసుకోవడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఒత్తిడి మేరకు కొద్ది మంది రైతులకు వివరణ నోటీసులు ఇచ్చి మమ అనిపించినట్లు తెలుస్తోంది. సమస్యను పరిష్కరించే దిశగా మత్స్యశాఖ అధికారులు వ్యవహరించడలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యను జిల్లా కమిటీ ఛైర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారో లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

విచారణ నివేదిక ఇంకా అందలేదు

బి.నర్సయ్య, జిల్లా మత్స్యశాఖ అధికారి, ఏలూరు

నిడమర్రు మండలం ఎఫ్‌డిఒపై వచ్చిన ఫిర్యాదుపై కమిషనర్ కార్యాలయం ఆదేశాల మేరకు కైకలూరు ఎడి రాజ్‌కుమార్‌ను విచారణ అధికారిగా నియమించడం జరిగింది. ఇంకా విచారణ నివేదిక నా వద్దకు రాలేదు. ఫిర్యాదు ఆధారంగానే విచారణ ఉంటుంది. పారదర్శకంగానే విచారణ కొసాగుతుంది

ఎస్‌సి, ఎస్‌టి మహిళల సాధికారతే లక్ష్యం

- గతేడాది 1502 మంది మహిళలకు రూ. 8.32 కోట్ల రుణాలిచ్చాం
- ఈ ఎడాది 1705 మందికి రూ. 8.52 కోట్లు అందించాలన్నదే లక్ష్యం
- డిఆర్‌డిఎ ఉన్నతి జిల్లా కోఆర్డినేటర్ తిరుమాని మురళీకృష్ణ

ప్రజాశక్తి - భీమవరం





స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టి మహిళల సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు డిఆర్‌డిఎ ఉన్నతి జిల్లా కోఆర్డినేటర్, ఎపిఒ ఇన్‌ఛార్జి తిరుమాని మురళీకృష్ణ తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌లో భాగంగా ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు ఉన్నతి రుణాలను వడ్డీ లేకుండా అందిస్తున్నామన్నారు. ఒక్కో మహిళకు రూ.30 వేల నుంచి రూ. 5 లక్షల వరకూ అందించడం జరుగుతుందన్నారు. ఈ రుణాల ద్వారా మహిళల ర్థిక పరిస్థితులను మెరుగుపర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. గతేడాది 1502 మంది ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు రూ.8 కోట్ల 32 లక్షల రుణాలు అందజేశామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రుణాలు మంజూరు, రికవరీలో నూటికి 115 శాతం సాధించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పశ్చిమగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఈ ఏడాది 1705 మంది మహిళలకు రూ. 8 కోట్ల 52 లక్షలు అందించాలని లక్ష్యంగా తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో ఉన్నతి రుణాలు మంజూరు, రికవరీ, ఎస్‌సి, ఎస్‌టి మహిళల అభివృద్ధికి ప్రణాళిక, ఇప్పటివరకూ చేకూరిన లబ్ధి, పెన్షన్ల పంపిణీ వంటి అంశాలపై ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖిలో ఉన్నతి జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణ వివరాలు వెల్లడించారు.

ప్రశ్న : ఉన్నతి రుణాలు అంటే ఏమిటి? ఈ రుణాలు ఎవరికిస్తారు?

డిఆర్‌డిఎ ద్వారా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి మహిళల ఆర్థికాభివృద్ధికి ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌లో భాగంగా ప్రభుత్వం రుణాలు అందిస్తుంది. ఎస్‌సి, ఎస్‌టి మహిళలు అన్ని రంగాల్లో సాధికారిత సాధించాలనే ముఖ్యోద్దేశంతో ప్రభుత్వం రుణాలు అందించి వారి ఆర్థిక స్థితిగతులను మార్చేందుకు కృషి చేస్తోంది.

ప్రశ్న : ఎంత రుణం ఇస్తారు? ఎప్పటిలోగా చెల్లించాలి? వడ్డీ ఎంత చెల్లించాలి?

స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి మహిళలు 18 నుంచి 59 వయసు కలిగి ఉంటే రుణం తీసుకునేందుకు అర్హులు. ఒక్కో మహిళకు రూ.30 వేల నుంచి రూ.5 లక్షల వరకూ ఎటువంటి వడ్డీ లేకుండా రుణాలు అందించడం జరుగుతుంది. రూ.30 వేల నుంచి రూ.50 వేల లోపు రుణం తీసుకుంటే 24 వాయిదాలు, రూ.50 వేలు నుంచి రూ.లక్ష లోపు తీసుకుంటే 36 వాయిదాలు, రూ.లక్ష నుంచి రూ.2 లక్షలలోపు తీసుకుంటే 48 వాయిదాలు, రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల లోపు తీసుకుంటే 60 వాయిదాల రూపంలో తీసుకున్న మొత్తాన్ని ఎటువంటి వడ్డీ లేకుండా చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ తీసుకున్న రుణాన్ని చెల్లిస్తూ ఉండగా సంబంధిత మహిళ మృతి చెందితే తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని మండల సమాఖ్యలు ఉన్నాయి? స్వయం సహాయక సంఘాలు ఎన్ని ఉన్నాయి? ఎంతమంది సభ్యులున్నారు?

జిల్లాలో 19 మండల సమాఖ్యలు ఉన్నాయి. 851 మంది విలేజ్ ఆర్గనైజర్లు ఉన్నారు. 28,709 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. 2 లక్షల 93 వేల 733 మంది సభ్యులు ఉన్నారు.

ప్రశ్న : ఎస్‌సి, ఎస్‌టి స్వయం సహాయక సంఘాలు ఎన్ని? సభ్యులు ఎంతమంది ఉన్నారు?

4,817 ఎస్‌సి స్వయం సహాయక సంఘాల్లో 47,274 మంది సభ్యులు ఉన్నారు. అలాగే 86 ఎస్‌టి స్వయం సహాయక సంఘాల్లో 838 మంది సభ్యులు ఉన్నారు.

ప్రశ్న : గతేడాది ఉన్నతి రుణాలు మంజూరు, రికవరీ చేయడంలో ఎంత మేర లక్ష్యం సాధించారు. ఈ ఏడాది చేసిన ప్రణాళిక ఏమిటి?

2024-2025లో 1,480 మంది ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు రూ.7 కోట్ల 75 లక్షల రుణాలు అందించేందుకు లక్ష్యంగా తీసుకోగా 1,502 మంది మహిళలకు రూ.8 కోట్ల 32 లక్షలు అందించడం జరిగింది. అనుకున్న లక్ష్యానికి మించి రుణాలు అందించడమే కాకుండా రికవరీ కూడా చేశాం. జిల్లా వ్యాప్తంగా 115 శాతం సాధించాం. రుణాలు మంజూరు, రికవరీలో రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్‌తో పాటు ఎపి ఎంఒలు, సిసిలు, విఒఎలు, ప్రాజెక్టు సిబ్బంది, మహిళా సంఘాలు అందించిన సహకారం మరువలేనిది. వీరందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 2025 - 2026గాను 1,705 మంది మహిళలకు రూ.8 కోట్ల 52 లక్షలు అందించాలని ప్రణాళిక రూపొందించి లక్ష్యంగా తీసుకున్నాం.

ప్రశ్న : జిల్లాలో ఎంతమంది పెన్షన్ లబ్ధిదారులు ఉన్నారు? ప్రతి నెలా పెన్షన్ రూపంలో ఎంత చెల్లిస్తున్నారు?

జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల పెన్షన్లు తీసుకుంటున్న లబ్ధిదారులు 2 లక్షల 23 వేల మంది ఉన్నారు. ప్రతి నెలా రూ.96 కోట్ల 98 లక్షలు పెన్షన్ రూపంలో చెల్లించడం జరుగుతుంది.

ప్రశ్న: పౌజు పెన్షన్లకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు?

2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకూ భర్త పెన్షన్ తీసుకుంటూ చనిపోయిన వారు 3,242 మంది ఉన్నారు. దీనిలో 1952 మంది మహిళలు పౌజు పెన్షన్ తీసుకుని ఎందుకు దరఖాస్తు చేసుకున్నారు. సుమారు 1,229 మంది వివిధ కారణాలు చేత దరఖాస్తు చేసుకోలేదు. పౌజు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఇప్పటికే పెన్షన్ అందించే విధంగా చర్యలు చేపట్టాం.

రాజ్యాంగ పరిరక్షణ పౌరుల బాధ్యత

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు - ఆకట్టుకున్న అంబేద్కర్ జీవిత చరిత్ర కళారూప ప్రదర్శన

ప్రజాశక్తి - భీమవరం

దేశంలో రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపైనా ఉందని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పిలుపునిచ్చారు. శనివారం రాత్రి గునుపూడిలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారి అంబేద్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన నిర్వహించారు. తొలుత అంబేద్కర్ చిత్ర పటానికి శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పూలమాల వేయగా పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి సహా అతిథులు పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ సభలో కొయ్యే మోషన్‌రాజు మాట్లాడారు. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని గునుపూడిలో నిర్వహించడం ఇదే తొలిసారన్నారు. భారతదేశంలో రాజ్యాంగం ఒక దిక్సూచిగా ఉందన్నారు. భిన్నత్వంలో ఏకత్వంగా ప్రజలందరినీ సమానంగా చూసేదే రాజ్యాంగం అన్నారు. ప్రతి ఇంట్లో పవిత్ర గ్రంథంతోపాటు రాజ్యాంగం కూడా ఉండాలన్నారు. అంతటి ప్రాచుర్యం పొందిన అలాంటి రాజ్యాంగాన్ని రచించిన మేధావి అంబేద్కర్ గురించి మరింత తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంబేద్కర్ జీవితాన్ని చదవడం, వినడం చేశామని ఇప్పుడు కళ్లకు కట్టినట్లు అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారు చూపారని అభినందనలు తెలిపారు. నాటక ప్రదర్శన అద్భుతంగా ఉందన్నారు. అందుకే తన జీవితంలో జరిగిన అన్ని ఘటనలూ, అవమానాలూ, పోరాటాలూ, సామాజిక, రాజకీయ పరిస్థితులనూ కళ్లకు కట్టినట్లు చూపారని ఇలాంటి నాటక ప్రదర్శన మునుపన్నడూ చూడలేదని తెలిపారు.



మాట్లాడుతున్న శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

దేశంలో రాజ్యాంగం ప్రమాదంలో పడిందని రాజ్యాంగ హక్కులకై ఐక్యంగా పోరాడాలని ఎంఎల్‌సి గోపీమూర్తి పిలుపునిచ్చారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ పార్టీ మతాన్ని ఉపయోగించి ప్రజల మధ్య చీలికలు తెస్తున్నారన్నారు. రాజ్యాంగం సమానత్వాన్ని సూచిస్తోందని అసమానతలుగా ఉన్న సమాజంపై అట్టడుగు వర్గాల ప్రజలు, శ్రామికులు, కార్మికులు ఐక్యంగా పోరాడాలన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంద్ర మాల్యాద్రి మాట్లాడుతూ అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ వారి సహకారంతో అంబేద్కర్ జీవిత చరిత్రను ప్రజలందరికీ కళ్లకు కట్టినట్లు చూపించాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా సామాజిక చైతన్య సాంస్కృతిక ఉత్సవాల సందర్భంగా అన్ని జిల్లాల్లో ఈ కళారూప నాటక ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 22వ తేదీన కర్నూల్‌లో ప్రారంభమైన ఈ ప్రదర్శనలు ఈ నెల 18వ తేదీన విజయవాడ వరకూ జరిగినట్లు తెలిపారు. అంబేద్కర్ ఆశయ సాధనకై కెవిపిఎస్ కృషి చేస్తోందని గుర్తు చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం పూర్వ రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం మాట్లాడుతూ ఇలాంటి కళారూప ప్రదర్శనలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేలా నాటక ప్రదర్శన ఉందన్నారు. అనంతరం రూ.50 వేలు నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు కళాకారుల ప్రోత్సాహాన్ని కొయ్యే మోషన్‌రాజు చేతుల మీదుగా అందించారు. నాటక ప్రదర్శనకు అవసరమయ్యే స్టేజీ సహా ఏర్పాట్లు చేసిన శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు, కళాకారుల ప్రోత్సాహకాన్ని అందించిన దాసి రాజుకు కెవిపిఎస్ జిల్లా, రాష్ట్ర నేతలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ జగ్గరాజు, ఐఎఎస్ ఫోరం అధ్యక్షులు సిద్ధోధి రావు, అంబేద్కర్ బుద్ధిస్ట్ హైదరాబాద్ కెకె.రాజా, చైతన్య భారతి అధ్యక్షులు రాయప్రోలు భగవాన్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.బలరాం, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి న్యూటన్, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కోన జోసెఫ్, ఎస్‌సి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.వీరయ్య, బహుజన జెఎసి గౌరవాధ్యక్షులు కాటన్ స్టాలిన్, రాష్ట్ర కార్యదర్శి డివి.సాగర్, జైభీమ్ సేవాదళ్ ఫౌండర్ మీసాల జయరాజు, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్, డివిఎంసి మెంబర్ సత్య సుధామ, రిటైర్డ్ రైల్వే ఎంప్లాయ్ కేసి.రాజు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ నాయకుడు సోడదాసి గంగయ్య, కాంగ్రెస్ ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు కాకర రాజ్ కుమార్ పాల్గొన్నారు.

జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రశాంతం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐటిల్లో ప్రవేశాలకు గానూ నిర్వహించే జెఇఇ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష ఆదివారం తాడేపల్లిగూడెం శ్రీవాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం, సాయంత్రం రెండు పూటలా ప్రశాంతంగా జరిగినట్లు కళాశాల ప్రిన్సిపల్, చీఫ్ సూపరింటెండెంట్ రత్నాకర్ రావు తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షకు 136 మందికి 135 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారని తెలిపారు. ఉదయం హాజరైన అభ్యర్థులే సాయంత్రం జరిగిన పేపర్-2 పరీక్ష రాసినట్లు తెలిపారు. పరిశీలకులుగా ఐఐటి మద్రాస్ నుండి వచ్చిన ప్రొఫెసర్ మూర్తి, టెస్ట్ సెంటర్ అడ్మినిస్టేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్, టిసిఎస్ ప్రతినిధులు పరీక్షా నిర్వహణను పర్యవేక్షించినట్లు తెలిపారు. అలాగే శశి ఇంజినీరింగ్ కాలేజీలో పరీక్ష ప్రశాంతంగా నిర్వహించినట్లు కాలేజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బహుమతి ఇస్మాయిల్ తెలిపారు. 480 మంది విద్యార్థులకు గాను 478 మంది హాజరయ్యారని తెలిపారు.

కాలువ పూడికతీత పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డిసి ఛైర్మన్ ఫణి, స్థానిక నాయకులు

ప్రజాశక్తి - ఉండి

పంట కాలువల ప్రక్షాళన వల్ల శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీటిపారుదల సాగుతుందని ఉండి డిసి ఛైర్మన్ తోట ఫణి అన్నారు. ఆదివారం ఉండి మండలం చెరుకువాడలో పంట కాలువ పూడికతీత పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పంట మురుగు కాలువల ప్రక్షాళన చేయకుండా ఐదు సంవత్సరాలు నిధులను దుర్వినియోగం చేసిందని, దాని ఫలితంగానే భారీ వర్షాలకు పొలాలు ముంపుకు గురయ్యేవని గుర్తుచేశారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎంఎల్ఎ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు ఆదేశాల మేరకు పంట కాలువల ప్రక్షాళన, పంట కాలువలోకి పెట్టిన మరుగుదొడ్ల పైపులు, డ్రెయినేజీ పైపులను ధ్వంసం చేయడం వంటి కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు వారు వివరించారు. పూడిక తీసిన మట్టిని పంట కాలవలను బలోపేతం చేసేందుకు గట్లపై వేసి, వాటిని చదును చేసి మట్టి కాలువలోకి వెళ్లకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ గ్రామ అధ్యక్షులు ఇర్రింకి బుజ్జి, సీనియర్ నాయకులు ఉంగరాల నాగేశ్వరరావు, జనసేన మండల ప్రధాన కార్యదర్శి కుచ్చు శివకృష్ణ, పలువురు రైతులు ఉన్నారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో కోట్లలో లావాదేవీలు

అకౌంట్ సీజ్ : సిఐ రజినీకుమార్


ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు క్రికెట్ బెట్టింగ్ కేసులో అనుమానాస్పదంగా ఉన్న ఒక ముద్దాయి అకౌంట్‌లో రూ.23 కోట్ల లావాదేవీలు జరిగినట్లు బయట పడ్డాయని, ఆ అకౌంట్‌ను సీజ్ చేశామని సిఐ కె.రజనీ కుమార్ చెప్పారు. ఆదివారం పాలకొల్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సిఐ మీడియాతో మాట్లాడారు. ఆ నిధులు ఎక్కడ నుంచి వచ్చాయనేదానిపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ముద్దాయికి సంబంధించి పెట్రోల్ బంక్ లావాదేవీలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గత నెల 20 పాలకొల్లు శివారు వై జంక్షన్ వద్ద ఇరువురుని ఆపి, వారి వద్ద ఉన్న ల్యాబ్‌టాప్, సెల్ ఫోన్లు తనిఖీ చేయగా మరో 10 మంది క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారని చెప్పారు. ఎ3గా యడ్ల నాగేశ్వరరావు, ఎ4గా యడ్ల తాతాజీ ఉన్నట్లు సిఐ చెప్పారు. వీరిరువురు అరెస్ట్ కాకుండా హైకోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారన్నారు. మొత్తం 10 మంది అకౌంట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యలో రాణించాలి

ఎంఎల్ఎ ధర్మరాజు, తహశీల్దార్ అప్పారావు

ప్రజాశక్తి - గణపవరం



విద్యార్థినికి చెక్ అందజేస్తున్న ఎంఎల్ఎ

విద్యార్థులు విద్యలో రాణిస్తే వారి జీవన స్థితిగతులు మారతాయని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, గణపవరం తహశీల్దార్ వైకె.అప్పారావు అన్నారు. సరిపల్లిలో ఉన్న ఇండియన్ డిజిటల్ స్కూల్‌కి చెందిన విద్యార్థి కురిటి సత్య గోవింద మహేశ్వరి పది పరీక్షల్లో స్కూల్ ఫస్ట్ వచ్చిన సందర్భంగా స్కూల్ డైరెక్టర్ జివి.ప్రసాద్ రూ.లక్ష క్యాస్ ప్రైజ్‌ని ఎంఎల్ఎ ధర్మరాజు, తహశీల్దార్ అప్పారావు చేతుల మీదుగా మహేశ్వరికి అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి స్కూల్ డైరెక్టర్ ప్రసాద్ అధ్యక్షత వహించగా ధర్మరాజు, అప్పారావు మాట్లాడుతూ ఇండియన్ డిజిటల్ స్కూల్ విద్యార్థులకు ఉన్నతమైన విద్య అందించటంతో పాటు వారి విద్యాభివృద్ధికి స్కాలర్ షిప్‌లు అందజేయటం హర్షించతగ్గ విషయమని అన్నారు. మెరిట్ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందించి విద్యార్థులలో పోటీతత్వాన్ని పెంచి వారిని విద్యలో రాణించే విధంగా చేస్తున్న సంస్థ యాజమాన్యాన్ని అభినందించారు. స్కూల్ డైరెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ తమ సంస్థలో విద్యార్థులు ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

21న డిఇఒ కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయండి

యుటిఎఫ్ నాయకుల పిలుపు

ప్రజాశక్తి - ఆకివీడు

ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన సంస్కరణలు విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నాయని, ఈ సంస్కరణలను వ్యతిరేకిస్తూ ఈనెల 21వ తేదీన చేపట్టిన జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని యుటిఎఫ్ మండల కార్యదర్శి ఆర్‌వి.నారాయణ(విక్రమ్) పిలుపునిచ్చారు. మోడల్ ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్‌గా స్కూల్ అసిస్టెంట్‌ను నియమించే ఆశాస్త్రీయ నిర్ణయం విరమించుకోవాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థి నిష్పత్తి 1:35 గానూ 45 తరువాత 2వ విభాగంగానూ అమలు చేయాలన్నారు. సమాంతర మాధ్యమం, చిన్న మాధ్యమం అన్ని పాఠశాలల్లో కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయ పోస్టులను బ్లాక్ చేయడం సరైన మార్గం కాదు, బదిలీలలో ఖాళీ స్థలాలన్నింటినీ చూపించాలని తెలిపారు. ఫౌండేషన్ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థి సంఖ్య 41 వద్ద 3వ పోస్ట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌లో స్టూడెంట్స్ ప్రమేయం లేకుండా అన్ని సబ్జెక్ట్స్‌కి టీచర్స్‌ని నియమించాలన్నారు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌తో మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. అసంబంధమైన హేతుబద్ధీకరణ ఆపాలి, హేతుబద్ధీకరణ గురయ్యే జూనియర్లకు, సీనియర్లకు కూడా 5 పాయింట్లు ఇవ్వాలన్నారు. ఎయిడెడ్ నుంచి విలీనమైన ఉపాధ్యాయులకు కూడా సీనియారిటీ వచ్చేలా పాయింట్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చెసారు. ఈ డిమాండ్లపైన ఈనెల 21న జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో కార్యకర్తలు భారీగా పాల్గొనాలని ఆయన కోరారు.

పిజిఆర్ఎస్ వికేంద్రీకరణ

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

సోమవారం నిర్వహించే 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'(పిజిఆర్ఎస్) కార్యక్రమం లో మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా ఫిర్యాదులు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ జిల్లా స్థాయితో పాటు మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించుకోవచ్చునన్నారు. ప్రజలకి పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునన్నారు. వారి అర్జీల నమోదు, నమోదైన అర్జీలకు సంబంధించి సమాచారం ఏమన్నా తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేసి తెలుసుకోవచ్చని కూడా తెలియజేశారు. అర్జీదారులు గమనించాలని తెలిపారు.

వివేకానందుని ప్రేరణతో స్కూల్ స్థాపన

పది పరీక్షా ఫలితాల్లో మండల ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం

మార్టేరు వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ సెక్రటరీ, కరస్పాండెంట్ గుడిమెట్ల రామారెడ్డి

ప్రజాశక్తి – పెనుమంట్ర

విశ్వ మహనీయుడు వివేకానందుని ఆశయాల ప్రేరణతో 1994లో గ్రామీణ ప్రాంతమైన మండలంలోని మార్టేరులో వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను తెలుగు, ఇంగ్లీష్ మీడియం బోధనగా ప్రారంభించినట్లు స్కూల్ కార్యదర్శి, కరస్పాండెంట్ గుడిమెట్ల రామారెడ్డి తెలిపారు. ప్రస్తుతం 2024-25 విద్యా సంవత్సరంలో వచ్చిన టెన్త్ ఫలితాల్లో 20 మంది విద్యార్థులకు 20 మంది పాస్ అవ్వడం ద్వారా 100 శాతం ఫలితాలు సాధించినట్లు పేర్కొన్నారు. తక్కువ ఫీజులతో, మెరుగైన వసతులతో, ఉత్తమ బోధనతో మంచి ఫలితాలు సాధించామన్నారు.



కరస్పాండెంట్ గుడిమెట్ల రామారెడ్డి, హెచ్‌ఎం తులసి



సిహెచ్.ప్రణీత మండల ఫస్ట్, కె.సింధు భవిత సెకండ్

మండల స్థాయిలో టెన్త్ ప్రథమ, ద్వితీయ స్థానాలు

మండల స్థాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్స్‌లో ప్రథమ స్థానం చెల్లబోయిన ప్రణీత(589), ద్వితీయ స్థానం కొవ్వూరి సింధు భవిత(582) సాధించి స్కూల్ ఘనతను చాటారని ఆయన సంతోషం వ్యక్తంచేశారు. ప్రభుత్వం నుంచి తొలుత ఎల్‌కెజి నుంచి 3వ తరగతి వరకు, తర్వాత 2003లో 7వ తరగతి వరకు, 2006-07 విద్యా సంవత్సరం నుంచి టెన్త్ వరకు అంచెలంచెలుగా గుర్తింపు పొంది సాగుతున్న విద్యాసంస్థగా అందరి ఆదరాభిమానాలు పొందుతున్నామని అన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల ప్రగతి కోసం ఏర్పాటు చేసిన వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఈ 31 సంవత్సరాలుగా ప్రతీ సంవత్సరం టెన్త్‌లో టాప్ మార్కుల సాధనతో ముందుకు దూసుకుపోతుందని రామారెడ్డి పేర్కొన్నారు. స్కూల్‌కు ప్రధానోపాధ్యాయులుగా వ్యవహరిస్తున్న చిలుకూరి తులసి, అన్ని తరగతుల, సబ్జెక్టుల ఉపాధ్యాయుల సహకారం, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్ల స్కూల్ విజయాలకి నిలయంగా నిలుస్తుందని, ఇక్కడ పిల్లలు క్రీడల్లో సైతం రాణిస్తున్నారని కరస్పాండెంట్ రామారెడ్డి తెలిపారు.



మార్టేరు వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్

ఉచిత వైద్య శిబిరాల్లో పలువురికి పరీక్షలు


మొగల్తూరు : పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి – మొగల్తూరు

తీర ప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటుచేసినట్లు ఆర్యవైశ్య మొగల్తూరు గ్రామ అధ్యక్షులు సంకా ముత్యారామ నాగేశ్వరరావు, సంకా సోమరాజు అన్నారు. మొగల్తూరులోని సీతారామ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ 50వ వార్షికోత్సవం పురస్కరించుకుని స్థానిక సంకా సీతారామయ్య, అనంతపల్లి ముత్యాలరావు శ్రీవాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరంలో గుండె, ఊపిరితిత్తుల వైద్యనిపుణులు సంకా వెంకట సుబ్రహ్మణ్య పాపారావు, చిన్నపిల్లల వైద్య నిపుణులు కోడూరి సాయి మనోజ్, స్త్రీ వైద్య నిపుణులు టంగుటూరి లావణ్య, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు పి.కృష్ణ ఫణీంద్ర, చర్మవ్యాధుల నిపుణులు ఎన్‌విఎస్.సింధు, గుండె సంబంధిత వ్యాధి నిపుణులు సిరిపురం యుధిష్టర్, దంత వైద్యనిపుణులు వి.శ్రావణి, సంకా సంతోషి లక్ష్మి ఈ శిబిరంలో సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించారు. పలువురికి ఉచితంగా మందులు అందించి సూచనలు చేశారు. ఈ శిబిరంలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా సీతారామ మెడికల్ స్టోర్స్ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తణుకు : సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా నిర్వహించు ఇంటింటికీ వైద్యం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ నేత్ర వైద్యులు, డా.హుస్సేన్ అహ్మద్ తణుకు, చివటం, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి ఆరుగురు వృద్ధులకు ఉచిత వైద్య సేవలందించారు. సభ్యులు కె.రామమోహనరావు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి, సభ్యులు వడ్లమాని పార్వతి, గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఉచిత నేత్ర శిబిరం

తాడేపల్లిగూడెం : నిడదవోలు రాజరాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ హాస్పిటల్ వైద్యులచే ఆదివారం కడకట్ల జనత హాస్పిటల్‌లో ఉచిత నేత్ర శిబిరం ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ అధ్యక్షులు వివిఎన్.లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన లయన్స్ మదన్ మోహన్ అగర్వాల్(డిస్ట్రిక్ట్ ఛైర్‌పర్సన్) ప్రారంభించారు. ఈ ఉచిత నేత్ర శిబిరంలో 87 మంది పరీక్షలు నిర్వహించి 20 మందికి ఉచితంగా కళ్లజోళ్లను అందజేశారు. ఆపరేషన్స్ నిమిత్తం 10 మందిని నిడదవోలు హాస్పిటల్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సుంకర శ్రీనివాసరావు(జోన్ ఛైర్మన్), కార్యదర్శి చిన్నం జగదీష్, ఎల్ఎస్‌వి.నాగేశ్వరరావు(జనత డాక్టర్), దాట్ల లక్ష్మీపతి రాజు, గరికపాటి బాపయ్యశర్మ, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



తణుకు: వైద్య సేవలందజేస్తున్న వైద్యులు

ఉండి: ఉచిత వైద్య శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలిగొట్ల–ఆరేడు ఎంపిటిసి రుద్రరాజు యువరాజు అన్నారు. ఆదివారం ఉండి మండలం ఆరేడు గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వినాయక హాస్పిటల్ భీమవరం వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రుద్రరాజు యువరాజు మాట్లాడుతూ ఉచిత మెడికల్ క్యాంపుల వల్ల రోగ నిర్ధారణ ముందుగా తెలుసుకొని తగు జాగ్రత్తలు పాటించవచ్చునని అన్నారు. పాందువ్వ, ఆరేడు, కలిగొట్ల గ్రామాల ప్రజలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినందుకు డాక్టర్ సాగిరాజు గజపతిరాజు గ్యాస్ట్రాలజీ, జనరల్ సర్జన్‌కు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ గజపతిరాజు మాట్లాడుతూ తమ సొంత గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ క్యాంపులో ప్రసూతి, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ సాగిరాజు దివ్య తేజ, డాక్టర్ సిహెచ్.విజయ్ కుమార్ రెడ్డి ఎముకల వైద్య నిపుణులు, డాక్టర్ జి.మౌనిక చిన్న పిల్లల వైద్య నిపుణులు వైద్య సేవలు అందించారు. సుమారు 300 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరేడు సర్పంచి కట్రెడ్డి బ్రహ్మానందం, గొట్టం బాబి, సాగిరాజు రామరాజు, కట్రెడ్డి నాని, నవీన్ వర్మ, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం: నేత్ర శిబిరంలో పరీక్షిస్తున్న వైద్యులు


ఉండిలో..

కొనసాగిన వేసవి శిక్షణ తరగతులు


నరసాపురంలో..


ప్రజాశక్తి – నరసాపురం

ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా ఆదివారం పిల్లలకు అక్బర్ బీర్బల్, పంచతంత్ర కథలు చెప్పడం, వారిచేత పుస్తకాలు చదివించడం, ట్వింకిల్, మ్యాజిక్ పాట్ వంటి పత్రికలు చదివించడం జరిగింది. చదవడం నాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఆర్.వెంకట సుబ్బారావు ఆర్మీ ఉద్యోగి రిసోర్స్ పర్సన్‌గా పాల్గొని ఆర్మీకి సంబంధించిన విషయాలు పిల్లలతో పంచుకున్నారు. వారు ఆర్మీ గురించి మాట్లాడుతూ ఆర్మీ 24 గంటలు దేశాన్ని కాపాడుతూ ఉంటుందన్నారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, బేసిక్ ట్రైనింగ్, డ్రిల్ ట్రైనింగ్, వెపన్ ట్రైనింగ్, సార్ట్ ట్రైనింగ్ గురించి వివరించారు. వారిచేత డ్రిల్ కూడా చేయించారు. బిజిబిఎస్ మహిళ కళాశాల ప్రిన్సిపల్ కె.అమ్మాజీ మాట్లాడుతూ విద్య ఆవశ్యకత, గురువు ప్రాధాన్యతల గురించి వివరించి, పాటలు పాడించడం, పజిల్స్, పొడుపు కథలు విప్పడం మొదలైన విషయాల మీద శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సుబ్బారావు, సూర్యంబాబు, భట్టిప్రోలు సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ వేసవి విజ్ఞాన తరగతులు జూన్ 6వ తేదీ వరకు జరుగుతాయని, పిల్లలు సద్వినియోగం చేసుకోవలసిందిగా గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి కోరారు.

లిపుస్తక పఠనంతో మేధాశక్తిలి

తాడేపల్లిగూడెం : పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థుల నుంచి పెద్దల వరకు మేధాశక్తివంతులు అవుతారని, విద్యార్థులు అందరూ తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ గ్రంథాలయంలోని శిక్షణ తరగతులలో విద్యార్థులకు నీతి కథలు, దేశభక్తి గేయాలు, ఇంగ్లీష్ గ్రామర్, మ్యాథమెటిక్స్, సైన్స్ పాఠాలు బోధించుటతోపాటు విద్యార్థులకు ఆటలు కూడా నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు రిసోర్స్ పర్సన్లుగా జనవిజ్ఞాన వేదిక సలహాదారుడు ప్రతి వీరాస్వామి, గరికపాటి బాపయ్య శర్మ, కోపెల్లి శ్రీనివాసరావు, ఎ.జనార్ధనరావు మాట్లాడుతూ మానవుని మనగడుకు ఆధారమైన చెట్లను నాటండి అని పిలుపునిచ్చారు.


పెనుమంట్రలో..


తాడేపల్లిగూడెంలో..

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం 20వ రోజు వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరం ఉత్సాహంగా జరిగింది. విద్యార్థులకు గ్రంథాలయం కమిటీ, స్థానిక మానవత సంస్థ కలిసి పలు కార్యక్రమాలు నిర్వహించారు. రిటైర్డ్ ఉపాధ్యాయిని పి. సువర్ణగౌరి పిల్లలకు ఇంగ్లీష్ స్టోరీ రీడింగ్, టెల్లింగ్ నేర్పించారు. గ్రంథాలయం మాస్టర్ పిటిఎస్.కుమార్ పిల్లల చేత కథల బుక్స్ చదివించారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో ఎం.జాహ్నవి, కె.భవ్య, కె.కళశ్రీ, బి.పూర్విక, ఎస్.సుభాష్, బి.గీత, కె.సాయి, సిఆర్.రోనాల్డ్, జె.మోహన్, బి.కార్తిక, కె.దీపిక పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలు అందజేత

మహిళల అభివృద్ధికి కృషి :ఎపిఎం అమీర్ ఉన్నీసా

గణపవరం : మండలంలో డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న మహిళల అభివృద్ధికి రూ.54 కోట్ల 33 లక్షల 4 వేల రుణాలను అందించినట్లు ఎపిఎం అమీర్ ఉన్నీసా ఆదివారం తెలిపారు. మండలాల వారీగా ఉన్న 46 గ్రామ సంఘాలలో ఉన్న బ్యాంకు ద్వారా 599 సంఘాలకు రుణాలు అందజేసి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో స్త్రీ నిధి లోను తీసుకున్నవారు 1049 మంది ఉన్నారని చెప్పారు. వీరికి రూ.9 కోట్ల 88 లక్షలు అందించినట్లు చెప్పారు. అలాగే మండలంలో ఉన్నతి లోను తీసుకున్న వారు 66 మంది ఉన్నారని, వీరికి రూ.36 లక్షలు అందజేసినట్లు చెప్పారు. వెలుగు డిఆర్‌డిఎ ద్వారా మండలంలో ఉన్న డ్వాక్రా గ్రూపులకు ప్రభుత్వం అందించే సొమ్ములతో చిన్న చిన్న వ్యాపారాలు చేతివృత్తుల ద్వారా అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు.

ఘనంగా పద్దాల వెంకమ్మ జాతర

నరసాపురం : మండలంలోని కొప్పరులో ఉన్న శ్రీపద్దాల వెంకమ్మ వారి జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఈ జాతర మహోత్సవాలకు సినిమా కమెడియన్ బెల్లంకొండ ప్రవీణ్, నరసాపురం మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవ నాయుడు హాజరయ్యారు. జనసేన నాయకులు పోలిశెట్టి శ్రీనివాస్ ఉన్నారు.


ధాన్యానికి మద్దతు ధర ఇస్తున్నాం..

వ్యవసాయాధికారి అడబాల జ్యోషిలా

పెనుమంట్ర : ధాన్యం పండించిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దత్తు ధర ఇస్తున్నట్టు పెనుమంట్ర మండల వ్యవసాయ అధికారిణి అడబాల జ్యోషిలా తెలిపారు. ఆదివారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలో రబీ సీజన్‌లో 12,123 ఎకరాలలో వరి పంట సాగు చేయబడిందని, దీనికి గాను 43,900 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్లు గుర్తించడమైందని పేర్కొన్నారు. ఈమేరకు మండలంలో ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా మొత్తం ధాన్యం కొనుగోలుకు సరిపడా గోనె సంచులు రైతులకు అందజేశామన్నారు. ఒక క్రమ పద్ధతిలో రోజుకి మెయ్యి నుంచి 1500 మెట్రిక్ టన్నుల వరకూ రైతులు కోరిన మిల్లులకు నాణ్యత ప్రమాణాలకు లోబడి కొనుగోలు చేస్తున్నామని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రైతుల ఖాతాలకు నేరుగా జమ చేయబడుతున్నాయని ఆమె తెలిపారు. ఇప్పటి వరకూ మొత్తం 40,150 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం పూర్తిచేశామని, ఇంకా 3,750 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయవలసి ఉందని, రాబోవు మూడు రోజులలో కొనుగోలు పూర్తి చేస్తామని జ్యోషిలా తెలిపారు.

'మహానాడును జయప్రదం చేయండి'

భీమవరం టౌన్ : గ్రామ, వార్డు మండల, పట్టణ కమిటీల సంస్థాగత ఎన్నికల ప్రతిపాదనలు జిల్లా పార్టీ నుంచి రాష్ట్ర పార్టీకి పంపనున్నామని, ఈనెల 24వ తేదీన తణుకులో నిర్వహించే జిల్లా మహానాడు, 27, 28, 29 తేదీలలో కడపలో నిర్వహించే రాష్ట్ర మహానాడు సమావేశాలకు నియోజకవర్గ టిడిపి శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం నియోజకవర్గ టిడిపి మహానాడు సమావేశాన్ని భీమవరం పట్టణంలోని ఆనంద ఫంక్షన్ హాల్లో ఆదివారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా టిడిపి జెండా ఆవిష్కరించి అనంతరం మహానాడు సమావేశాన్ని ప్రారంభించి కీర్తిశేషులు నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు మాట్లాడారు. ఎంసి మాజీ చైర్మన్ ఇ.రామలింగరాజు, ఇ.సుబ్రహ్మణ్యరాజు పాల్గొన్నారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న బుద్ధరాజు

ప్రమాద బాధితునికి వసుధ ఆర్థిక సాయం

ప్రజాశక్తి – పాలకొల్లు

పాలకొల్లు పట్టణంలోని ఎల్ఆర్ పేటలో నివాసం ఉంటున్న పేరిచర్ల మణికంఠ వర్మకు ప్రమాదవశాత్తు కాలు విరిగింది. వీరు వైద్యానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు రూ.7 వేల చెక్కును పంపించగా పాలకొల్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పి.బుద్ధరాజు బాధితుని ఇంటి వద్ద అందజేశారు. ఈ కార్యక్రమంలో భూపతిరాజు అనంత లక్ష్మి పాల్గొన్నారు. ఆర్థిక సహాయం చేసినందుకు ఫౌండేషన్ ఛైర్మన్‌కి మణికంఠ తల్లి కృతజ్ఞతలు తెలియజేశారు.


ఫైరింగ్ చేస్తున్న ఎన్‌సిసి క్యాండెట్స్

ఫైరింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి – నరసాపురం

సీతారాంపురం సౌత్ స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల స్థాయి ఎన్‌సిసి మాన్యువల్ ట్రెయినింగ్ క్యాంపులో ఆదివారం ఫైరింగ్‌పై శిక్షణ అందించారు. ఎన్‌సిసి క్యాంప్ ఆధ్వర్యంలో ఫైర్ సర్వీస్ వారి డెమో, దానివల్ల జరుగు ఉపయోగాల గురించి నరసాపురం స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె.భాస్కర రామమ్ అందరికీ తెలియజేశారు. టి.నాగరాజు మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ క్యాంపును ఉద్దేశించి పిల్లలందరికీ కూడా క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కమాండర్ సి. రోహిత్ కుమార్ మాట్లాడుతూ ఎన్‌సిసి వల్ల కలుగు ఉపయోగాలు తెలియజేశారు.


సభ్యత్వ కిట్లు అందజేస్తున్న ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

జనసేన సభ్యత్వ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

కార్యకర్త బాగుంటేనే పార్టీ బాగుంటుంది అన్నదే జనసేన అధినేత ఆలోచనని రాష్ట్ర విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉభయగోదావరి జిల్లా జనసేన కోఆర్డినేటర్ కొరెడ్డి మధులత ఆధ్వర్యంలో స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రియాశీలక సభ్యత్వ నమోదు కిట్లను పట్టణ, వార్డు, గ్రామ జనసేన వాలంటీర్లకి ఎంఎల్ఎ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొలిశెట్టి మాట్లాడుతూ రాజకీయాల్లో కార్యకర్తలు ముందుండి నడిపిస్తేనే పార్టీ పరుగులు తీస్తుందని ఈ విషయాన్ని గుర్తించిన డిప్యూటీ ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ కార్యకర్తలను వారి కుటుంబంలో ఒక్కరిగా చూస్తారని అన్నారు. కుటుంబంలో జనసేన కార్యకర్తలు ఎవరికైనా చిన్న ఆపద వచ్చినప్పటికీ జన సైనికులు ఆదుకునేలా వ్యవస్థను ఏర్పాటు చేశారని, ఎవరైనా పార్టీ కార్యకర్తలకు ఏమైనా జరిగితే అండగా ఉండేందుకు జనసేన ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందన్నారు. జనసేన కుటుంబంలో ఎవరైనా ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సహాయం అందుతుందని, యాక్సిడెంట్ జరిగితే రూ.50 వేల వరకు సహాయం అందిస్తున్నారని అన్నారు. బీమా కూడా జనసేన ఆలోచనలకు అనుగుణంగా ఆచరణ చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి, రూరల్, మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, పెంటపాడు మండల అధ్యక్షులు పుల్ల బాబి, జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి – మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బంది ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం యాత్రికులతో ఆదివారం సందడి నెలకొంది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బంది ముత్యాలమ్మ భజన సంఘం సభ్యులు ఆలపించిన గీతాలు భక్తులను అలరింపజేశాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి మెకా అరుణ్ కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవ కార్యక్రమం నిర్వహించారు.

సరిపల్లి వద్ద రోడ్డు ప్రమాదం

వ్యక్తి మృతి : మరొకరికి గాయాలు

ప్రజాశక్తి – గణపవరం

మండలంలోని సరిపల్లి సిపిఎఫ్ ఫ్యాక్టరీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందగా మరొకరికి గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. గణపవరం ఎస్ఐ ఎం.మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం కలిగొట్ల గ్రామానికి చెందిన బిరుదుగడ్డ సాల్మన్(43), దాసరి మరళీ కలసి వారి మోటారు సైకిల్‌పై గణపవరం నుంచి కలిగొట్ల వెళుతున్నారని చెప్పారు. వారు సరిపల్లి సిపిఎఫ్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఐసర్ వాహనాన్ని ఢీ కొట్టినట్లు చెప్పారు. ఈ సంఘటనలో సాల్మన్ అక్కడికక్కడే మృతిచెందినట్లు చెప్పారు. మరో వ్యక్తి దాసరి మరళీకి గాయాలయ్యాయన్నారు. మృతిచెందిన సాల్మన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరిద్దరు వ్యవసాయ కూలీలని, మృతిచెందిన సాల్మన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. గాయాలపాలైన దాసరి మరళిని వైద్య నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవు

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి

ప్రజాశక్తి – తణుకు

బెల్ట్ షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి అన్నారు. తణుకు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన దాడులలో అత్తిలి మండలం కత్తవపాడు గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న గంట సత్యనారాయణ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో ఎస్ఐ ఆర్.మధుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


తణుకు: జాతీయ జెండాతో భారీ ర్యాలీ

భారీ జాతీయ జెండాతో తిరంగా యాత్ర

ప్రజాశక్తి – తణుకు

ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకుని భారత సాయుధ దళాల పట్ల పౌరులు కృతజ్ఞతా భావాన్ని వ్యక్తపరచే రాజకీయేతర ఉద్యమంగా దేశవ్యాప్తంగా చేపట్టిన తిరంగా యాత్రలో భాగంగా తణుకులో ఆదివారం నిర్వహించిన తిరంగా యాత్ర ప్రజల్లో దేశభక్తిని రగిలించింది. జాతీయ జెండాలతో పాటు సుమారు 400 అడుగుల పొడవు కలిగిన జాతీయ పతాకాన్ని చేత పట్టుకుని తణుకులో నిర్వహించిన తిరంగా యాత్రకు విశేష స్పందన లభించింది. తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా తిరంగా యాత్ర మున్సిపల్ కార్యాలయం నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా నరేంద్ర సెంటర్, వెంకటేశ్వర థియేటర్ సెంటర్ వరకు సాగింది. భారత్ మాతాకీ జై.. జై జవాన్.. జై భారత్.. వందేమాతరం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పట్టణంలోని ప్రధాన రోడ్డు వెంబడి జాతీయ జెండా చేతపట్టుకుని ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు, వైద్యులు, విద్యార్థులు, యువత మధ్యన నడుచుకుంటూ వెళ్లిన ఎంఎల్ఎ ప్రజల్లో జాతీయ స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిటైర్డ్ మిలటరీ జవాన్లను ఎంఎల్ఎ రాధాకృష్ణ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదుల్ని ప్రోత్సహిస్తూ భారత్ పై ఉసిగొల్పుతున్న పాకిస్తాన్ మరోసారి కవ్వింపు చర్యలకు పాల్పడుతూ దేశాభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నా.. ఉగ్రమూకలను మట్టి కరిపించే విధంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయ్యిందన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో త్రివిధ దళాల సైన్యానికి ఆయన సంఘీభావం తెలిపారు. తిరంగా యాత్రలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

నరసాపురం: ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ఆదివారం నరసాపురంలో గొప్ప దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటేలా తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ ర్యాలీ పంజా సెంటర్ నుంచి ప్రారంభమై శ్రీలక్ష్మి హాల్, పాతబజార్, గాంధీబొమ్మ సెంటర్, అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొని దేశభక్తిని ప్రతిబింబించేలా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ర్యాలీలో కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఆకన చంద్రశేఖర్, వలవల నాని, కొల్లు పెద్దిరాజు, కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, చక్రం శ్రీమన్నారాయణ, గుబ్బల నాగరాజు, కొల్లాటి గోపికృష్ణ, వాతాడి కనకరాజు, వాతాడి ఉమా, రావూరి ప్రసాద్, బందెల రవీంద్ర ఉన్నారు.


నరసాపురంలో..